క్లుప్తంగా

రేపు జాతీయ క్రీడా దినోత్సవం

నారాయణపేట రూరల్: భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా గురువారం నారాయణపేట మినీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శెట్టి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు క్రీడాకారులు క్రీడా అభిమానులు మరియు విద్యార్థులు గురువారం ఉదయం 7 గంటలకు స్థానిక స్టేడియం నుంచి నిర్వహించే ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రుణాల మాఫీలో విఫలం

మరికల్: ప్రభుత్వం రైతులకు రుణాలను మాఫీ చేయడంలో విఫలం చెందిందని బీఆర్ఎస్ మండల నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, నరహరి, గాదం మల్లేష్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రూ. 2లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని హామీచ్చిన ప్రభుత్వం ఆ మేరకు మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. మాఫీ కాని రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. అర్హులైన వారందరికీ రుణాలు మాఫీచేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఏఈఓకు సన్మానం

ఊట్కూరు: మండలంలోని ఎర్గాట్‌పల్లిలో నూతనంగా విధుల్లో చేరిన ఏఈఓ తిలక్‌ను రైతులు ఘనంగా సన్మానించారు. ఇటీవల పులిమామిడి సెక్టార్‌కు ఆయన బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో రైతులు తిమ్మప్ప, వెంకటప్ప, నర్సింహులు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలి

మరికల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాప్‌ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పల్లెగడ్డ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. అధిక ధరలకు మద్యం అమ్ముతు కాసులు కళ్ల చూస్తున్న బెల్ట్ షాప్‌లపై తక్షణమే ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మక్తల్: పట్టణంలోని లిటిల్ ఏంజిల్ ఉన్నత పాఠశాలకు చెందిన అనిత, జయలలిత రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జగదీష్ స్థానిక విలేకరులకు తెలియజేశారు. ఈమేరకు.. మంగళవారం జిల్లా కేంద్రంలోని రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల 13, 15 తేదీలలో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. అనంతరం విశ్రాంతి పీఈటీ గోపాలంను పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సమస్య పరిష్కారానికి కృషి



మాగనూర్: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గతకొన్ని నెలలుగా రోడ్డు ప్రధాన సమస్యగా ఉందని కాలనీవాసులు తెలుపడంతో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఏడీ, ఏఈ కాలనీ పరిశీలించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. కాలనీలో త్వరలో రోడ్డుపై మట్టి వెయించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని అధికారులు తెలిపారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్పందించిన అధికారులకు, నాయకులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, పంచాయతీరాజ్ ఏడీ కల్యాణ్ రెడ్డి, ఏఈ మారుతి ఉన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలి

మరికల్: ఉద్యానవన శాఖ అధికారులు కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు రాములు, వెంకటయ్య అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు కూరగాయల సాగుపై అవగాహన లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వాటి ధరలు మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ పంటలు తప్ప రైతులు ఎవరూ కూడా కూరగాయల సాగుపై దృష్టికి పెట్టకపోవడంతో అధికారుల తప్పిదమేనన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో తోటల విస్తీర్ణం పెరిగేలా ఉద్యానవన శాఖ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన

ఆత్మకూర్: జిల్లా శిశు, మహిళాసాధికారిత, డీహెచ్ఈడబ్ల్యూ, ఆధ్వర్యంలో పోక్సోచట్టం, బాల్యవివాహాలపై మంగళవారం స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి, మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఎదురైనా విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కోవాలని, సమస్య జరిలమని గుర్తిస్తే 100, 181, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సంతలో సమస్యల కరువు

- రోడ్డు పైనే విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులు
- మార్కెట్ సదుపాయం కల్పించాలంటున్న స్థానికులు



వర్షంలో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్

దామరగిద్ద: ఏళ్లుగా వారాంతపు సంత నిర్వహణకు ప్రత్యేక సదుపాయం లేక చిరువ్యాపారులు ఎండా, వానకు తడుస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్న దుస్థితి. మండల కేంద్రమైన దామరగిద్దలో ప్రతి మంగళవారం నిర్వహించే తైబజార్‌లో వ్యాపారులు వర్షానికి, ఎండకు గొడుగు పట్టాల్సిందే. పాలకులు ప్రభుత్వాలు మారుతున్న మార్కెట్ సదుపాయాల కల్పనలో పెద్దగా మార్పు రాలేదు. మార్కెట్ సదుపాయం లేక చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇరుకు రోడ్డు ఉండగా రోడ్డు విస్తరణతో ప్రధాన రహదారిలో రాకపోకలకు సౌకర్యం కల్గింది. ప్రస్తుతం ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట రోడ్డు నుంచి నగరేశ్వర ఆలయం వరకు ఇరుకైనా మట్టి రోడ్డుపై ఇరువైపుల సంతబజార్ నిర్వహిస్తున్నారు. దీంతో ఎలాంటి షెడ్డులు లేకపోవడంతో వర్షం నుంచి రక్షించుకునేందుకు గొడుగు నీడే ఆధారంగా మారింది. ఇరుకు రోడ్డుపై ఇరువైపుల వ్యాపారులు కూర్చోవడంతో కొనుగోలుదారులు సైతం ఇరుకు స్థలంలో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి వ్యాపారి తైబజార్ రుసుము చెల్లిస్తున్నారు. ఏటా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయలు వేలంపాట ద్వారా ఆదాయం సమకూరుతున్న సరైన మార్కెట్ స్థలాన్ని గుర్తించి సదుపాయం కల్పించకపోవడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలు దారులు ఇబ్బందులకు గురుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వ్యాపారుస్తులు కోరుతున్నారు.

రోడ్డుపైనే అమ్ముకుంటున్నాం..



ప్రతి మంగళవారం కూరగాయలు అమ్మేందుకు మద్దూర్ నుంచి ప్రతి వారం వస్తాను. సంతలో రోడ్డుపై కూర్చొని అమ్ముకుంటాం. ఎలాంటి సదుపాయం లేదు. వానకు తడుస్తు గొడుగు కింద కూర్చొని కూరగాయాలు అమ్ముకుంటున్నాం. మార్కెట్ ఫీజు కట్టించుకుంటున్న సదుపాయాలు మాత్రం కల్పించడం లేదు.

\- అంజమ్మ, కూరగాయల వ్యాపారి, దామరగిద్ద

సదుపాయం కల్పించాలి.



సంవత్సరాలు క్రితం నుంచి సంత బజార్ అదే పరిస్థితిలో ఉంది. ఎలాంటి మార్కెట్ సదుపాయం లేదు. ఇరుకు రోడ్డుపై ప్రతి మంగళవారం సంత నిర్వ హిస్తుంటారు. మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో రద్దీ పెరిగి తిరిగేందుకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు ప్రత్యేక స్థలంలో మార్కెట్ సదుపాయం కల్పించి సౌకర్యం కల్పి ంచాలి.

\- గోవింద్, కూరగాయల వ్యాపారి, బాపన్‌పల్లి

స్థల పరిశీలన చేపడతాం

ప్రతి మంగళ వారం నిర్వహించే వారంతపు తైబజార్ నిర్వహణకు స్థలం లేక రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారుల సమన్వయంతో ప్రభుత్వ స్థల పరిశీలన చేపడతాం. స్థలం లభిస్తే ఈజీఎస్ లేదా ఇతర నిధులతో కూడిన తైబజార్ ఏర్పాటుకు కృషిచేస్తాం.

\- సాయిలక్ష్మి, ఎంపీడీఓ, దామరగిద్ద

చక్రపాణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



మాగనూర్‌నుంచి మహాధర్నాకు తరలుతున్న నాయకులు

కృష్ణా/మాగనూర్: దళితుల పెళ్లిని గుడిబయట జరుపుకోవాలని ఆదేశించి అవమానించిన పూజారి, సీనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగి చక్రపాణిపై చట్టపరమైన తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు క్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు.. ఈ నెల 18న మూడమాల్‌లో దళిత కుటుంబానికి చెందిన ఒబులేష్ పెళ్లి జరుపుకునేందుకు గుడిలో అనుమతించకపోవడంతో గుడి బయట మెట్లపై జరుపుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఉద్యోగిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ దయాకర్‌రెడ్డికి అందజేశారు. అలాగే కృష్ణా మండలంలో చేపట్టిన మహాధర్నాకు టీఎస్ ఎమ్మార్పీఎస్ మాగనూర్ మండల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు సుతారి కృష్ణయ్య, బోపాలి వెంకటేష్, నర్సింహ, లక్ష్మప్ప, రమేష్, హన్మంతు, దత్తు, సిద్దు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహులు, తాయప్ప డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన రెండు లక్షల పంట రుణ మాఫీలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికి రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ జైపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మధు, పీడీఎస్‌యూ మహేష్, బాల్‌రాజ్, రాజు, అజయ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

నారాయణపేట రూరల్: విద్యార్థి దశలోనే చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డీఈఓ కార్యాలయ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, జీసీడీఓ పద్మనళిని అన్నారు. పట్టణంలోని మిని స్టేడియం గ్రౌండ్‌లో పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడామాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కళాశాల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నర్సింహులు, జీహెచ్ఎం వేణుగోపాల్, అథ్లెటిక్స్ సెక్రెటరీ రమణ, న్యాయనిర్ణేతలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న బాలకృష్ణారెడ్డి

మక్తల్: పట్టణంలోని మంగళవారం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆలయ నిర్మాణంకోసం రూ. 2లక్షలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ తరపున బాలకృష్ణారెడ్డిని శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి, మాజీ లక్ష్మారెడ్డి, రవికుమార్‌యాదవ్, సిద్ధార్థరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి..



ధన్వాడ: పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్‌తోపాటు 317 జీఓ సమస్య పరిష్కరించబడుతుందాన్నరు. హెచ్ఎంలు నర్సింహాచారి, జానర్ధన్‌రెడ్డి, జ్యోతిప్రకాశ్‌రెడ్డి, తపస్ జిల్లా నాయకులు గోవిందు, కనకప్ప, తిరుపతయ్య, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, వెంకటేష్, రాంచందర్, నరేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వనమోదు..

మాగనూర్: డీటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిందని జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలలో ఉపాధ్యాలతో ఆయన డీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్యావిధానం కావాలని, కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలులోకి తేవాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థులకు సరిపడా బోధన సిబ్బందిని నియమించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పరందాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలోని లైన్‌వాడలో నేషనల్ ఆయుష్ మిషన్ తరపున జీరియాట్రిక్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యునానీ మెడికల్ ఆఫీసర్ డా.తయాబా బేగం హాజరై వయో వృద్ధులకు అన్ని రకాల ఆరోగ్య సమస్యలను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా.సురేష్ నాయక్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ జోషి, పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



నారాయణపేట పేరపళ్ల ప్రభుత్వ పాఠశాలలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



మక్తల్‌లో ఉట్టి కొడుతున్న యువకులు

నారాయణపేట రూరల్ : శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలను పట్టణ కేంద్రంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. పట్టణం, మండలంలోని పలువురు తల్లులు తమ పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబు చేశారు. అనంతరం గోపిక వేషధారణ వేసిన చిన్నారులు కోలాటం ఆడుతూ.. సందడి చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడు, గోపికల వేషధారణతో నృత్యాలు చేశారు. ఉట్టి కొట్టి సందడి చేశారు.

మక్తల్: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కృష్ణానది నుంచి పుష్కర నీటిని తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చిన్నపెద్ద తేడాలు లేకుండా ఉట్లు కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. అలాగే శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. చిన్నారులు కృష్ణుడి, గోపిక వేషధారణలో అలరించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, కొండయ్య, రవికుమార్‌యాదవ్, శ్రీనివాస్‌గుప్తా, కట్టసురేష్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, కావలి శ్రీహరి, తిరుపతి, నర్సింహులు, డైరెక్టర్ రాధకృష్ణ, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: కృష్ణాష్టమి వేడుకల్లో సందర్భంగా మంగళవారం మండలంలోని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఈ మేరకు.. చిన్నారులు కృష్ణుడి, గోపిక వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భీంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత ,గ్రామ నాయకులు పూజారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోకులనంద.. గోవింద..

నర్వ: శ్రీకృష్ణాష్టమి ఉత్సవాల భాగంగా రెండోరోజు మంగళవారం వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని ఉట్లు స్తంభాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కోస్గిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మాగనూర్‌లో..

కోస్గి: విద్యార్థులు చదువుతోపాటు ఆటలపై శ్రద్ధ చూపాలని, ఆటలతో మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యం పొందొచ్చని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం వెంకట్రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలలో క్రీడలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించిన తర్వాత విద్యార్థులచే క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగనూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జీహెచ్ఎం మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురష్కరించుకొని ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఫిజికల్ ఎడ్యూకేషన్ ఉపాధ్యాయులు రాకేష్ శర్మ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు రిక్రియేషన్ క్రీడలు, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులలో క్రీడాలపై ఆసక్తి పెంచేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి..



మాట్లాడుతున్న సంఘ సేవకులు రాఘవశర్మ

మద్దూరు: సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే రోగాల నుంచి మానవజాతిని కాపాడుకోవచ్చని ఉత్తమ రైతు అవార్డు పొందిన నాగరాజు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సేంద్రియ వ్యవసాయంతో కలిగే మేలును తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం మండలంలోని గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సేంద్రియ ఎరువుల వాడకం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. అలాగే ప్రముఖ సంఘ సేవకులు రాఘవశర్మ విద్యార్థి జీవితం, హిందూ ధర్మం, విద్యార్థులకు అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే చేయాల్సి పనిని వివరించారు. పాఠశాల యాజమాన్యం వెంకటయ్య, సాయిసేవా ట్రస్టు సభ్యులు హన్మంతు, నరేష్, బస్వరాజ్‌యాదవ్, మల్లేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ఊరేగింపు



పేటలో ఊరేగింపు కలశం ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళా భక్తులు



మద్దూరులో..

నారాయణపేట రూరల్: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో బజరంగ్‌దళ్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కొనసాగుతున్న ఉత్సవాలుమంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెల్లవారుజామున గోపూజ, ధ్వజారోహణం పూజలు కొనసాగాయి. అదేవిధంగా గొడుగుగేరీ హనుమాన్ ఆలయం నుంచి అశోక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం వరకు ప్రత్యేక రథంలో బొడ్రాయి ఊరేగింపు చేపట్టారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కలశం, జల్ది బిందెను శోభాయాత్ర ద్వారా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేపట్టారు.

నేడు ప్రతిష్ఠాపన :

రెండోరోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం యాగశాల ప్రవేశం ధ్వజస్తంభ, బొడ్రాయి, కలశ ప్రతిష్ఠాపన భక్తి శ్రద్ధతో చేయనున్నారు. దీనికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గందె అనసూయతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు.

ఆలయంలో కొనసాగిన చండీ హోమం

మద్దూరు: పట్టణంలోని గీతాంజలి పాఠశాల సమీపంలో దత్తాత్రేయ సహిత సాయిబాబా ఆలయంలో విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా కొనసాగుతుంది. ప్రతిష్ఠాపనలో భాగంగా రెండోరోజూ విగ్రహా ప్రతిష్ఠాపకులు మంత్రహోమాలు, చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు సతిసమేతంలో పూజలో పాల్గొన్నారు.అనంతరం ధాన్యాధివాసం, జలాధివాసం నిర్వహించిన పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. బుధవారందేవతామూర్తులకు ప్రాణప్రతిష్ఠచేసి విగ్రహాలను ప్రతి ష్ఠించనున్నట్లు రాఘవశర్మ తెలిపారు.



మద్దూర్‌లో ఆలయం హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రోడ్డు నిబంధనలు పాటించాలి..

కృష్ణా: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఎండీ నవీద్ సూచించారు. మంగళవారం మండలంలోని జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు.. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, సీట్ బెల్టును ధరించాలన్నారు. లేని పక్షంలో వారికి నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని ఎస్ఐ తెలియజేశారు.

బెయిల్ మంజూరుపై సంబరాలు



మరికల్‌లో బాణాసంచా కాలుస్తున్న నాయకులు

మరికల్: ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్ట్ బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, రవి, బాలకృష్ణ, సాయి, హన్మంతు, శ్రీను, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్ట్ బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. అనంతరం బాణా సంచాకాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ధన్వాడ: మండలంలోని మందిపల్లి తాండలో శ్రీకృష్ణ దేవుని జాతర ఉత్సవాల ఘనంగా నిర్వహించారు. రెండురోజులు పాటు కొనసాగిన ఈ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. జల్దిబిందెతో పవిత్రజలం తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.